ప్రజావాణి ఎప్పటి వార్తలు అప్పుడే...
5 PM
మన సమగ్ర ప్రజావాణి
RNI NO:TGTEL/25/A5443
తెలుగు డైలీ
గురువారం , 24, సెప్టెంబర్, 2026
MANA SAMAGRA PRAJAVANI TELUGU DAILY
https://epaper.prajavaani.net

### సుప్రీంకోర్టులో దానం పిటిషన్ తిరస్కరణ..

# ఇక ఖైరతాబాద్‌లో ఉప ఎన్నికే!

- దానం నాగేందర్ అనర్హత వేటును సమర్థించిన సుప్రీంకోర్టు
- ఉప ఎన్నికలో పోటీ చేసుకోవాలని సూచన
- పదవితో పాటు పార్టీ మారితే ఫిరాయింపేనని స్పష్టీకరణ
- తీర్పు నేపథ్యంలో సీఎం నివాసానికి వెళ్లిన దానం
- సుప్రీం తీర్పు పట్ల బీఆర్ఎస్, బీజేపీ హర్షం





ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్‌కు సుప్రీంకోర్టులో ఎదురుదెబ్బ తగిలింది. తనను ఎమ్మెల్యేగా అనర్హుడిగా ప్రకటిస్తూ తెలంగాణ హైకోర్టు ఇచ్చిన తీర్పుపై స్టే ఇవ్వాలంటూ ఆయన దాఖలు చేసిన పిటిషన్‌ను సుప్రీంకోర్టు తిరస్కరించింది. హైకోర్టు తీర్పును సమర్థించింది. ఉపఎన్నికలో పోటీ చేయాలని సూచించింది. పదవితో పాటు పార్టీ మారితే ఫిరాయింపు కిందకే వస్తుందని, అది తప్పని తేల్చి చెప్పింది. దీంతో హైకోర్టు తీర్పు అమల్లోకి రానుంది. 2023 తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్ఎస్ తరఫున ఖైరతాబాద్ నుంచి దానం నాగేందర్ గెలిచారు. 2024లో ఆయన కాంగ్రెస్‌లో చేరారు. అదే ఏడాది జరిగిన లోక్‌సభ ఎన్నికల్లో సికింద్రాబాద్ నుంచి కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీ చేశారు. దీనిపై బీఆర్ఎస్, బీజేపీ నేతలు దానం నాగేందర్‌పై అనర్హత వేటు వేయాలని న్యాయస్థానాలను ఆశ్రయించారు. ఈ వ్యవహారంపై విచారణ జరిపిన తెలంగాణ హైకోర్టు సెప్టెంబర్ 18న దానం నాగేందర్‌ను ఎమ్మెల్యే పదవికి అనర్హుడిగా ప్రకటించింది. ఖైరతాబాద్ నియోజకవర్గం ఖాళీ అయినట్లు కూడా పేర్కొంది. ఆ తీర్పును సవాల్ చేస్తూ దానం నాగేందర్ సుప్రీంకోర్టును ఆశ్రయించారు. హైకోర్టు ఉత్తర్వులపై స్టే ఇవ్వాలని కోరారు. అయితే సుప్రీంకోర్టు ఆయన అభ్యర్థనను అంగీకరించలేదు. దీంతో ఖైరతాబాద్ ఎమ్మెల్యే పదవి ఖాళీగా మారిన నేపథ్యంలో అక్కడ ఉప ఎన్నిక అనివార్యమైంది. సీఎం నివాసానికి దానం సుప్రీంకోర్టు తీర్పు వెలువడే వరకు దానం నాగేందర్ ఖైరతాబాద్ వినాయకుడి వద్దే ఉన్నారు. నిమజ్జన ఏర్పాట్లను దగ్గరుండి పర్యవేక్షించారు. తీర్పు నేపథ్యంలో ఆయన అక్కడి నుంచి బయలుదేరి సీఎం రేవంత్ రెడ్డి ఇంటికి వెళ్లినట్లు సమాచారం. తదుపరి కార్యాచరణపై చర్చించే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. మరోవైపు సుప్రీంకోర్టు తీర్పు పట్ల బీఆర్ఎస్, బీజేపీ పార్టీలు హర్షం వ్యక్తం చేశాయి.

### కేటీపీపీలో ఉద్రిక్తత.. బీఆర్ఎస్ నాయకులను

# అడ్డుకున్న పోలీసులు



**జయశంకర్ భూపాలపల్లి :** జిల్లాలోని కేటీపీపీ ఆవరణలో ఉద్రిక్తత వాతావరణం నెలకొంది. కేటీపీపి సందర్శనకు వచ్చిన జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్ రెడ్డి, మాజీ మంత్రులు ఎర్రబెల్లి దయాకర్ రావు, సత్యవతి రాథోడ్, తాటికొండ రాజయ్య, మాజీ ఎమ్మెల్యేలు గండ్ర వెంకటరమణారెడ్డి, అరూరి రమేష్, శంకర్ నాయక్, ములుగు నియోజకవర్గ ఇంచార్జీ బడే నాగజ్యోతి తో పాటు బిఆర్ఎస్ రాష్ట్ర బృందాన్ని కేటిపిపి లోపలికి వెళ్లకుండా పోలీసులు బారికేడులు పెట్టీ అడ్డుకున్నారు. దీంతో పోలీసులకు, బీఆర్ఎస్ శ్రేణులకు మధ్య తోపులాట జరిగింది. ప్రభుత్వ వ్యతిరేక విధానాలను, పోలీసుల జనులను నిరసిస్తూ కేటీపీపి ముందు బీఆర్ఎస్ శ్రేణులను ధర్నా నిర్వహించారు. అనంతరం సొంత పూచికత్తుపై బీఆర్ఎస్ ప్రజాప్రతినిధులను, మాజీ మంత్రులు, మాజీ ఎమ్మెల్యేలను ప్లాంట్ లోపలికి పంపించారు.

## భారీ వర్షాలు.. జిల్లాల కలెక్టర్లకు కీలక ఆదేశాలు జారీ చేసిన చంద్రబాబు

**అమరావతి, సెప్టెంబర్ 24: :**
ఏపీలో తీవ్ర వాయుగుండం కారణంగా భారీ వర్షాల నేపథ్యంలో ముఖ్యమంత్రి చంద్రబాబు అధికార యంత్రాంగాన్ని అప్రమత్తం చేశారు. వరద ప్రభావిత జిల్లాల కలెక్టర్లు, ఉన్నతాధికారులతో ఆయన అత్యవసర టెలీకాన్ఫరెన్స్ నిర్వహించి సహాయక చర్యలు, ముందస్తు ప్రాణ నష్ట నివారణ చర్యలపై స్పష్టమైన దిశానిర్దేశం చేశారు. వాతావరణం పూర్తిగా అనుకూలించి వర్షాలు తగ్గుముఖం పట్టే వరకు ఏ ఒక్క అధికారి కూడా అశ్రద్ధ వహించకూడదని సూచించారు. జలాశయాలు, నదుల్లో పెరుగుతున్న నీటిమట్టాలను, ఇన్-ఫ్లోలను ఎప్పటికప్పుడు సమీక్షిస్తూ లోతట్టు ప్రాంత ప్రజలను ముందుగానే పునరావాస కేంద్రాలకు తరలించాలని స్పష్టం చేశారు. ఎక్కడా ప్రాణ, ఆస్తి నష్టం సంభవించకుండా ముందస్తు ప్రణాళికతో వ్యవహరించాల్సిన బాధ్యత అధికారులదేనని తేల్చి చెప్పారు. వరద ముంపునకు గురైన బాధితులకు నాణ్యమైన ఆహారం, మంచినీరు, అత్యవసర వైద్య సదుపాయాలు మరియు మందులు నిరంతరం అందుబాటులో ఉంచాలన్నారు. ఈదురు గాలుల వల్ల చెట్లు, విద్యుత్ స్తంభాలు నేలకొరిగితే తక్షణమే పునరుద్ధరణ పనులు చేపట్టి విద్యుత్ సరఫరాకు అంతరాయం కలగకుండా చూడాలని ఆదేశించారు. అంతేకాకుండా, వర్షాలు తగ్గిన వెంటనే పంట నష్టంపై కచ్చితమైన అంచనాలు రూపొందించి నష్టపోయిన ప్రతి



రైతుకూ ప్రభుత్వం అండగా నిలుస్తుందనే నమ్మకం కలిగించాలని కలెక్టర్లకు తేల్చి చెప్పారు.

### తెలంగాణ భూ అక్రమాలపై

# ప్రత్యేక కమిటీ విచారణ

**హైదరాబాద్, సెప్టెంబర్ 24 :** తెలంగాణ భూ అక్రమాలపై విచారణ కమిటీని రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసింది. భూముల అక్రమాలు, అవకతవకలపై విచారణకు ప్రభుత్వం ప్రత్యేక కమిటీని నియమించింది. ఈ మేరకు జీవో నంబర్ -134ను ప్రభుత్వం జారీ చేసింది. వివిధ జిల్లాల్లో భూములకు సంబంధించిన అక్రమాలపై విచారణ కమిటీని నియమించింది. చట్టాలు, నిబంధనలు, ప్రభుత్వ ఉత్తర్వుల ఉల్లంఘనలపై ఈ కమిటీ ఆరా తీయనుంది. ఈ అక్రమాలకు బాధ్యులెవరో తేల్చి తగిన చర్యలకు సిఫార్సులు చేయనుంది. ఈ కమిటీకి చైర్‌పర్సన్‌గా ఏ. శ్రీదేవసేన ఐఏఎస్ ఉన్నారు. కన్వీనర్‌గా రిజిస్ట్రేషన్స్ అండ్ స్టాంప్స్ స్పెషల్ సెక్రటరీ రాజీవ్‌గాంధీ హనుమంతు ఐఏఎస్, జనగామ కలెక్టర్ సందీప్ కుమార్ ఝా ఐఏఎస్‌తో పాటు సంబంధిత జిల్లాల కలెక్టర్లను కూడా కమిటీ సభ్యులుగా నియమించింది. ఈ భూములపై



విచారణ చేయనున్న కమిటీ..కేసీఆర్ కుటుంబం, కుటుంబ సభ్యులు, అనుచరులకు చెందిన భూములపై ఈ కమిటీ విచారణ చేయనుంది.

ఎర్రవల్లి, సిరివెంకటాపూర్ భూములపై..మాజీ మంత్రి హరీశ్‌రావు కుటుంబం, అనుచరులకు చెందిన రామంచ భూములపై..రంగనాయకసాగర్ సమీపంలోని భూములపై.. మల్లన్నసాగర్ భూసేకరణలో అక్రమాల ఆరోపణలపై.. జన్వాడలో కేటీఆర్ కుటుంబ సభ్యులు, అనుచరులు కొనుగోలు చేసిన భూములపై..మాజీ మంత్రి జగదీశ్వర్ రెడ్డి కుటుంబం, ఆయన అనుచరుల భూములపై..
అజీజ్‌నగర్‌లో మాజీ మంత్రి హరీశ్‌రావు భూములపై..అసైన్డ్ భూముల కొనుగోలు, ఆక్రమణలపైనా విచారణ మాజీ మంత్రి గంగుల కమలాకర్‌కు సంబంధించిన ప్రభుత్వ భూముల వ్యవహారంపై.. వట్టినాగులపల్లిలో పల్లా రాజేశ్వర్ రెడ్డి భూములపై.. శంకరాహిల్స్ భూముల కొనుగోలు వ్యవహారంపై..

### ఎంత అధికారం వచ్చినప్పటికీ

# సేవా మార్గాన్ని వీడం





**న్యూఢిల్లీ :** రాజకీయాల్లో ఎంత ఎత్తుకు ఎదిగినా ప్రజాసేవే తమకు ప్రధాన మార్గమని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ స్పష్టం చేశారు. గుజరాత్ నుంచి దిల్లీ వరకు తమ పాలన, విలువలకు సేవే మూలాధారమని చెప్పారు. ఎంత రాజకీయ అధికారం వచ్చినా సేవా మార్గం నుంచి వైదొలగబోమని పేర్కొన్నారు. 'సేవా సంకల్ప్ యాత్ర' భాగంగా వడనగర్ నుంచి ఉత్తర్‌ప్రదేశ్‌లోని వారణాసి వరకు బైక్ యాత్ర చేపడుతున్న సేవా యాత్రికులతో గురువారం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా మాట్లాడిన సందర్భంగా ప్రధాని ఈ వ్యాఖ్యలు చేశారు. పాలనలో సేవా భావం ఉన్నప్పుడు ప్రతి విధానంలోనూ 'నాగరిక్ దేవో భవ అనే స్ఫూర్తి ప్రతిబింబిస్తుందని ప్రధాని మోదీ అన్నారు. ప్రజలకు సేవ చేయడమే తమ ప్రాథమిక లక్ష్యంగా ఉండాలని యాత్రికులకు సూచించా రు. సేవ గురించి కేవ లం ప్రసంగాలు చేయడం కాకుండా, తమ ఆచ రణ ద్వారా దాని సందేశాన్ని ప్రజలకు అందిం చాలని మోదీ సూచించారు. ప్రజలకు సేవ చేస్తే, ఆ సేవే సందేశంగా మారుతుందని చెప్పా రు. 'సేవా పరోమో ధర్మః' అనే భావనతో ముందుకు సాగాలని యాత్రికులకు పిలుపునిచ్చారు.

### తెలంగాణలో నేడు, రేపు కుండపోత..

# పలు జిల్లాలకు రెడ్ అలెర్ట్

**హైదరాబాద్:** తెలంగాణలో నేడు, రేపు (గురు, శుక్రవారాలు) అతి భారీ నుంచి అత్యంత భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం హెచ్చరించింది. బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం ప్రభావంతో రాష్ట్రవ్యాప్తంగా వర్షాలు కురుస్తు న్నాయి. ఈ నేపథ్యంలో వాతావరణ శాఖ 5 జిల్లాలకు రెడ్ అలర్ట్, 8 జిల్లాలకు ఆరెంజ్ అలర్ట్ జారీ చేసింది. ఆసిఫాబాద్, మంచిర్యాల, భూపాలపల్లి, ములుగు, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల్లో అత్యంత భారీ వర్షాలు పడతాయని అంచనా వేస్తూ రెడ్ అలర్ట్ ప్రకటించింది. ఆదిలాబాద్, జగిత్యాల, కరీంనగర్, పెద్దపల్లి, ఖమ్మం, మహబూబాబాద్, వరంగల్, హనుమకొండ జిల్లాలకు ఆరెంజ్ అలర్ట్ జారీ చేసింది. మిగతా జిల్లాలకు ఎల్లో అలర్ట్ కొనసాగుతోంది. బుధవారం రాష్ట్రంలోని చాలా ప్రాంతాల్లో ఓ మోస్తరు నుంచి భారీ వర్షాలు కురిశాయి. ఉమ్మడి ఖమ్మం, మహబూబ్‌నగర్, నల్గొండ జిల్లాల్లో



రోజంతా ముసురు పట్టింది. ఖమ్మం జిల్లా కల్లూరులో అత్యధికంగా 6.28 సెం.మీ వర్షపాతం నమోదైంది. రెడ్ అలర్ట్ జారీ చేయడంతో భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కలెక్టర్ ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలకు రెండు రోజులు సెలవులు ప్రకటించారు. ఇదే జిల్లా బూర్గంపాడు మండలంలో గాలిదుమారం బీభత్సం సృష్టించింది.

### బాలాపూర్‌కు ముందే రికార్డు మోత.. హైదరాబాద్‌లో

# కోటి పలికిన గణేశుడి లడ్డూ!





**హైదరాబాద్:** హైదరాబాద్‌లో గణేశ్ లడ్డూ వేలం పాటలో మరోసారి భారీ ధర నమోదైంది. రాజేంద్రనగర్ సర్కిల్ పరిధిలోని కీర్తి రిచ్‌మండ్ గేటెడ్ కమ్యూనిటీలో మంగళవారం అర్ధరాత్రి జరిగిన వేలంలో గణపతి లడ్డూ ఏకంగా రూ.1.01 కోట్లు పలికింది. ప్రతి ఏటా పోటాపోటీగా జరిగే ఈ వేలంలో ఈసారి శక్తిమాన్ బృంద సభ్యులు లడ్డూను కైవసం చేసుకున్నారు. కీర్తి రిచ్‌మండ్ విల్లాస్‌లో లడ్డూ వేలానికి ప్రత్యేక గుర్తింపు ఉంది. కమ్యూనిటీ వాసులు నాలుగు గ్రూపులుగా విడిపోయి ప్రతి ఏటా పోటీ పడుతుంటారు. ఈసారి కూడా అర్ధరాత్రి వరకు ఉత్కంఠభరితంగా సాగిన వేలంలో శక్తిమాన్ బృందం విజయం సాధించింది. గతేడాది (2025) ఇదే కమ్యూనిటీలో లడ్డూ రికార్డు స్థాయిలో రూ.2.31 కోట్లు పలకడం గమనార్హం. ఆ రికార్డుతో పోలిస్తే ఈసారి ధర తక్కువే అయినప్పటికీ, కోటి రూపాయల మార్క్‌ను దాటడం నగరంలో చర్చనీయాంశంగా మారింది. స్వామివారి లడ్డూను దక్కించుకోవడం వల్ల శుభం, ఐశ్వర్యం కలుగుతాయనే బలమైన విశ్వాసంతో భక్తులు ఎంతటి ధరకైనా వెనుకాడటం లేదు. హైదరాబాద్‌లోని గేటెడ్ కమ్యూనిటీలలో లడ్డూ వేలం పాటలు కోట్లలో జరుగుతుండగా, ఇప్పుడు అందరి దృష్టి తెలుగు రాష్ట్రాల్లో ఎంతో ప్రతిష్ఠాత్మకంగా భావించే బాలాపూర్ లడ్డూ వేలంపై కేంద్రీకృతమైంది.

# తాటిపెల్లిలో వారంలోనే కూలిన డ్రైనేజీ గోడ

- నాసిరకం పనులపై బీజేపీ నేత సుంకపాక టైటస్ ఆగ్రహం







**మల్యాల, సెప్టెంబర్ 24 (మన సమగ్ర ప్రజావాణి):**
మల్యాల మండలం తాటిపెల్లి గ్రామంలోని ఒర్రెలో నూతనంగా నిర్మించిన డ్రైనేజీ రక్షణ గోడ (సిమెంట్ కాలువ) నాసిరకం నిర్మాణం వల్ల కట్టిన వారానికే కూలిపోయిందని బీజేపీ ఎస్సీ మోర్చా మండల అధ్యక్షుడు సుంకపాక టైటస్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఒక్క చిన్న వర్షానికే అవినీతి బట్టబయలైందని, వరి పొలాల పక్కనే నిర్మించిన ఈ డ్రైనేజీ కాలువను నాణ్యతా ప్రమాణాలకు అనుగుణంగా నిర్మించలేదని, కేవలం బిల్లులు డ్రా చేసుకోవడానికే ఇలాంటి నాసిరకం పనులు చేశారని ఆయన ఆరోపించారు. సిమెంట్, ఇసుక మిశ్రమం సక్రమంగా వాడకపోవడం వల్లే కట్టిన 7 రోజులకే గోడలు బీటలు వారి కుప్పకూలాయని పేర్కొన్నారు. అసిస్టెంట్ ఇంజనీర్ (ఏఈ) పర్యవేక్షణ పూర్తిగా లోపించిందని, అధికారుల నిర్లక్ష్యం, కాంట్రాక్టర్ల స్వార్థం వల్ల లక్షలాది రూపాయల ప్రజాధనం వృథా అయిందని మండిపడ్డారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి, ఈ నాసిరకం పనులపై తక్షణమే విచారణ జరిపించి, బాధ్యులైన కాంట్రాక్టర్, సంబంధిత అధికారులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో బీజేపీ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఆందోళనలు చేస్తామని సుంకపాక టైటస్ హెచ్చరించారు.

# మధిర 100 పడకల ఆసుపత్రిలో లీకేజ్...!

**సెకండ్ ఫ్లోర్ వర్షపు నీటితో లీక్ అవుతున్న వంద పడకల ఆసుపత్రి...?**
**ఖమ్మం బ్యూరో ప్రతినిధి మన ప్రజావాణి**

ఖమ్మం జిల్లా మధిర లో ఎంతో ప్రతిష్టాత్మకంగా నిర్మించిన 100 పడకల ఆసుపత్రిలో అన్ని లీకేజీలే.. ఈ లీకేజీల వల్ల అక్కడికి వచ్చిన పేషెంట్లు అవస్థ పడుతున్నారు. నూతనంగా నిర్మించిన వంద పడకల ఆస్పత్రి గత రెండు రోజులుగా కురుస్తున్న వర్షానికి రెండోవ అంతస్తు మొత్తం వర్షపు నీటితో లీకేజ్ అవుతుంది. పట్టమని మూడు సంవత్సరాలు కాకముందే ఇలా లీకేజ్ అవడంతో కాంట్రాక్టర్ ఎంత నాణ్యత నిర్మించాడో అర్థమవుతుందని పలువురు రోగులు మధిర పట్టణ ప్రజలు ఆరోపిస్తున్నారు. పేరుకే అభివృద్ధి నిర్మాణ పనులు.. అన్ని నాణ్యత లోపంతోనే నిర్మించబడుతున్నాయనే ఆరోపణలు నియోజకవర్గ వ్యాప్తంగా వినిపిస్తున్నప్పటికీ సంబంధిత క్వాలిటీ కంట్రోల్ అధికారులు పెద్దగా పట్టించుకోకపోవడం నాణ్యతా ప్రమాణాలు లేని నిర్మాణాలు జరుగుతున్నాయని ఆరోపణలు కూడా ఉన్నాయనే ఆరోపిస్తున్నారు. ప్రస్తుతం ప్రభుత్వం చేపడుతున్న ప్రజా ప్రభుత్వంలోనైనా నాణ్యమైన నిర్మాణాలను చేపట్టాలని మధిర ప్రజలు కోరుకుంటున్నారు. ఇప్పటికైనా సంబంధిత ఇంజనీరింగ్ క్వాలిటీ కంట్రోలింగ్ శాఖ విజిలెన్స్ శాఖలు క్షేత్రస్థాయిలో అభివృద్ధి పనులను పర్యవేక్షించి నాణ్యతా ప్రమాణాలు కలిగిన నిర్మాణాలు జరిగే విధంగా కృషి చేయాలని నాసిరకం నిర్మాణాలతో కోట్లాది రూపాయలు దుర్వినియోగం అవుతున్నాయఅనే ఆరోపణలకి శాశ్వతంగా చెక్ పెట్టాలని పలువురు నియోజకవర్గ ప్రజలు కోరుతున్నారు.






# తెలంగాణ ప్రభుత్వం రెండు డీఏలకు ఓకే..

- డిప్యూటీ సీఎం భట్టితో చర్చలు..
- అనంతరం మీడియాతో మాట్లాడుతున్న
- టీజీఈజేఏసీ చైర్మన్, సెక్రటరీ జనరల్, తదితరులు..
- దసరాలోపు ఇచ్చేందుకు ప్రభుత్వం అంగీకారం
- ఉద్యోగ సంఘాలతో డిప్యూటీ సీఎం భట్టి చర్చలు సఫలం
- సంక్రాంతికి మరో డీఏ విడుదల
- ప్రభుత్వ నిర్ణయంపై సుముఖత వ్యక్తం చేసిన టీజీఈజేఏసీ
- అతి త్వరలో పీఆర్‌సీ నివేదిక.. వేగవంతంగా ఫిట్‌మెంట్ ఖరారు...
- మార్చిలోపు పెండింగ్ బిల్లులను పరిష్కరించేలా చర్యలు..
- ప్రస్తుతం ఇస్తున్న రూ.వెయ్యి కోట్లకు మరిన్ని నిధులు
- సంక్రాంతికి మరో డీఏ ఇస్తామని ప్రభుత్వం హామీ..

ప్రభుత్వ నిర్ణయాలను స్వాగతించిన టీజీఈజేఏసీ



**హైదరాబాద్ స్టేట్ బ్యూరో/మన ప్రజావాణి (సెప్టెంబర్ 24):**
తెలంగాణ ఉద్యోగుల జాయింట్ యాక్షన్ కమిటీ (టీజీఈజేఏసీ) ప్రతినిధులతో ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క జరిపిన చర్చలు సఫలమయ్యాయి. ఉద్యోగ జేఏసీ డిమాండ్లపై ప్రభుత్వం సానుకూలంగా స్పందిస్తూ నిర్ణయం తీసుకుంది. దసరా పండుగలోపు రెండు డీఏలు ఇచ్చేందుకు ప్రభుత్వం అంగీకరించింది. అంతేకాకుండా సంక్రాంతి పండుగకు మరో డీఏ కూడా విడుదల చేస్తామని స్పష్టం చేసింది. బుధవారం మధ్యాహ్నం రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్‌జాజు ఆధ్వర్యంలో జరిగిన చర్చలు ఉద్యోగ సంఘాలను తీవ్ర ఆగ్రహానికి గురిచేశాయి. దీంతో ఉద్యోగ సంఘాల ప్రతినిధులు అర్ధంతరంగానే బయటకు వచ్చారు. టీజీఈజేఏసీ నేతలు ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేసుకుని నిరసనలు, ఉద్యమ కార్యాచరణకు సిద్ధమవుతున్న తరుణంలో ముఖ్యమంత్రి కార్యాలయం జోక్యం చేసుకుంది. వెంటనే సీఎం క్యాంపు కార్యాలయానికి రావాలని సూచించడంతో ఉద్యోగ సంఘాల నేతలు వెంటనే ఎంసీఆర్ హెచ్‌ఆర్‌డీలోని బోధి పెవిలియన్‌కు చేరుకున్నారు. ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్‌జాజు, ప్రత్యేక ప్రధాన కార్యదర్శి బెన్‌హర్ మహేశ్ దత్ ఎక్కా ఆధ్వర్యంలో టీజీఈజేఏసీతో చర్చలు జరిగాయి. చర్చల అనంతరం టీజీఈజేఏసీ చైర్మన్ మారం జగదీశ్వర్, సెక్రటరీ జనరల్ ఏలూరి శ్రీనివాసరావు మీడియాతో మాట్లాడారు. చర్చలకు సంబంధించిన అంశాలను వివరించారు. ఉద్యోగుల డిమాండ్లపై సానుకూలంగా స్పందిస్తూనే ప్రభుత్వం అనుకూలతల దృష్ట్యా నిర్ణయాన్ని ప్రకటించడంతో ఉద్యోగ సంఘాలు స్వాగతించాయి. మరింత అదనంగా నిధులుపీఆర్సీ కమిటీ నివేదికను వెంటనే తెప్పించుకోవాలని ఉద్యోగ సంఘాలు కోరగా.. పక్షం రోజుల్లో ఈ నివేదిక తెప్పించుకుంటామని, వీలైనంత వేగంగా నివేదికను పరిశీలించి, ఫిట్‌మెంట్‌పై నిర్ణయం తీసుకుంటామని ప్రభుత్వం హామీ ఇచ్చింది. ప్రస్తుతం ఉద్యోగుల పెండింగ్ బిల్లులకు సంబంధించి ప్రభుత్వం నెలవారీగా రూ.వెయ్యి కోట్లను విడుదల చేస్తోంది. ఈ నిధులను పెంచాలని కోరగా, ప్రభుత్వం కొంత వెసులుబాటు చేసుకుంటూ ప్రస్తుతం ఇస్తున్న నిధులకు మరిన్ని నిధులు జోడించి విడుదల చేస్తామని చెప్పింది. మార్చి ఆఖరులోపు ఉద్యోగుల పెండింగ్ బకాయిలు పూర్తిస్థాయిలో విడుదల చేస్తామని వెల్లడించారు. సీపీఎస్ రద్దుకు సంబంధించి ప్రత్యేక కమిటీ ఏర్పాటు చేస్తామని ఇటీవల సీఎస్ ఉద్యోగ సంఘాలకు తెలపగా, ఇప్పుడు కమిటీ ఏర్పాటు చేస్తున్నట్లు ఉపముఖ్యమంత్రి ముందు సీఎస్ ప్రకటించారు. ప్రస్తు తం రెండు డీఏలు దసరా పండుగలోపు ఇస్తామని చెబుతూనే, మరో డీఏ సంక్రాంతి పండుగకు ఇస్తామని వివరించారు. టీజీఈజేఏసీ ప్రధానంగా ప్రతిపాదించిన డిమాండ్లకు ప్రభుత్వం సానుకూలత వ్యక్తం చేస్తూ నిర్ణయాలు ప్రకటించడంతో ఉద్యోగ సంఘాల నేతలు శాంతించారు. క్షేత్రస్థాయి నుంచి తీవ్ర ఒత్తిడిటీజీఈజేఏసీపై క్షేత్రస్థాయి నుంచి తీవ్ర ఒత్తిడి నెలకొంది. ఉద్యోగుల సమస్యల పరిష్కారం విషయంలో నేతలు వెనక్కు తగ్గుతున్నారనే ఆరోపణలు ఉన్నాయి. టీజీఈజేఏసీ కూడా పలుమార్లు ఉద్యమ కార్యాచరణ ప్రకటించడం, తిరిగి వెనక్కి తగ్గి చర్చలవైపు దృష్టి పెట్టడంపై క్షేత్రస్థాయిలో ఉద్యోగుల్లో చులనక భావం పెరిగింది. దీంతో తాడోపేడో తేల్చుకుందామని ఒత్తిడి చేశాయి. దీంతో ఈనెల 10న చలో హైదరాబాద్ ప్రకటించింది. అయితే చివరి నిమిషంలో చలో హైదరాబాద్‌ను వాయిదా వేయడం పట్ల ఉద్యోగులు తీవ్రస్థాయిలో ఆగ్రహం వ్యక్తం చేశారు. సంఘాల నేతలపైనా ఇష్టానుసారంగా విమర్శలు గుప్పిస్తూ సామాజిక మాధ్యమాల్లో మండిపడ్డారు. తాజాగా ప్రభుత్వం రెండు డీఏలపై స్పష్టమైన హామీ ఇవ్వడం, మిగిలిన అంశాలపై దాటవేత ధోరణి ప్రదర్శించిందంటూ ఉద్యోగులు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం నుంచి సానుకూల స్పందన రావడంతో గురువారం టీఎన్జీఓ భవన్‌లో జరగాల్సిన జేఏసీ విస్తృత స్థాయి సమావేశాన్ని రద్దు చేయగా, ప్రభుత్వం నుంచి లిఖిత పూర్వక హామీలు రాకముందే నిర్ణయాలను వాయిదా వేసుకోవడంపైనా ఉద్యోగులు నిరుత్సాహం వ్యక్తం చేస్తున్నారు

# భక్తిశ్రద్ధలతో కుడా అపార్ట్‌మెంట్ వినాయక నిమజ్జనం

**హనుమకొండ సెప్టెంబర్ 24 (ప్రజావాణి )**
హనుమకొండ: గోకుల్ నగర్‌లోని అంబేద్కర్ భవన్ పక్కన ఉన్న కుడా అపార్ట్‌మెంట్‌లో వినాయక నవరాత్రి ఉత్సవాలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఉత్సవాల ముగింపు సందర్భంగా వినాయకుడి విగ్రహాన్ని భక్తుల కోలాహలం, జై గణేశ్ నినాదాల మధ్య హసన్‌పర్తి చెరువులో నిమజ్జనం చేశారు.

ఈ సందర్భంగా భక్తులు బై బై గణేశ్ అంటూ స్వామివారికి వీడ్కోలు పలికారు. కార్యక్రమాన్ని కుడా అపార్ట్‌మెంట్ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఇట్లు: కుడా అపార్ట్‌మెంట్ కమిటీ



# అత్యవసరమైతేనే మండల ప్రజలు బయటకు రావాలి: చిలుకూరు ఎస్ఐ

**చిలుకూరు సెప్టెంబర్ 23(ప్రజావాణి):** జిల్లాలో భారీ వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని చిలుకూరు మండల ఎస్ఐ బండి మోహన్ బాబు సూచించారు. అత్యవసరమైతే తప్ప బయటకు రావద్దని, పిల్లలు, వృద్ధులు, మహిళలు ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలని కోరారు. రహదారులపై ప్రయాణించే వాహనదారులు వేగాన్ని తగ్గించి జాగ్రత్తగా వెళ్లాలని,.నీరు ప్రవహిస్తున్న రహదారులు, వాగులు, కల్వర్టులు, లోతట్టు ప్రాంతాలను దాటేందుకు ప్రయత్నించవద్దని హెచ్చరించారు చెరువులు, కుంటలు, కాలువలు, వాగుల వద్దకు వెళ్లకూడదని . తెగిపడిన విద్యుత్ తీగలు, స్తంభాలు, ట్రాన్స్‌ఫార్మర్లకు దూరంగా ఉండాలని, తడిసిన విద్యుత్ పరికరాలను ముట్టుకోవద్దని,భారీ వర్షాలు, ఉరుములు, మెరుపుల సమయంలో రైతులు పొలాలకు వెళ్లకుండా సురక్షిత ప్రాంతాల్లో ఉండాలని, వ్యవసాయ మోటార్లు, విద్యుత్ ప్యానెళ్ల వద్ద అప్రమత్తంగా ఉండాలని,పాత భవనాలు, శిథిల గోడలు, చెట్ల కింద నిలబడవద్దని హెచ్చరించారు. రోడ్లపై ఏర్పాటు చేసిన బ్యారికేడ్లు, ట్రాఫిక్ ఆంక్షలు, పోలీసుల సూచనలు తప్పనిసరిగా పాటించాలని కోరారు. వదంతులను నమ్మకుండా అధికారిక సమాచారాన్ని మాత్రమే విశ్వసించాలని తెలిపారు. అత్యవసర పరిస్థితుల్లో డయల్ 112కు సమాచారం ఇవ్వాలని సూచించారు. చిలుకూరు ఎస్ఐ బండి మోహన్‌బాబు: ప్రమాదకర ప్రాంతాల్లో చిక్కుకున్నవారు స్వయంగా ప్రమాదాన్ని ఎదుర్కోకుండా వెంటనే పోలీసుల సహాయం కోరాలని తెలిపారు. “మీ భద్రతే మా బాధ్యత.. మీ అప్రమత్తతే మీ రక్షణ” అని పేర్కొన్నారు.



# తోలుకట్టలో గణేశుడి లడ్డును దక్కించుకున్న ప్రశాంత్ చారి (బబ్బీ)

**విశ్వకర్మ యువజన సంఘం గణేష్ మండపంలో రూ.40 వేలకు లడ్డు వేలం**

**మొయినాబాద్:** మొయినాబాద్ మండల పరిధిలోని తోలుకట్ట గ్రామంలో విశ్వకర్మ యువజన సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన గణేష్ మండపంలో లడ్డు వేలం నిర్వహించారు. ఈ వేలంలో ప్రశాంత్ చారి (బబ్బీ) రూ.40 వేలకు గణేశుడి లడ్డును దక్కించుకున్నారు. వినాయక నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా నిర్వహించిన ఈ వేలంలో భక్తులు, స్థానికులు పాల్గొన్నారు. గణేశుడి లడ్డూ ప్రసాదాన్ని దక్కించుకున్న ప్రశాంత్ చారి (బబ్బీ)కి మండప నిర్వాహకులు అభినందనలు తెలిపారు.




# వేలం పాటకు భిన్నంగా.. లడ్డూకు లక్కీ ఛాన్స్!

**గల్లీక గణేష్ నిర్వాహకుల వినూత్న ప్రయోగం..**
**నిమజ్జన వేడుకల్లో ప్రత్యేక ఆకర్షణ**





**అమీన్‌పూర్, సెప్టెంబర్ 23 (ప్రజావాణి ప్రతినిధి):** లడ్డూ కోసం వేలం పాట.. భారీ మొత్తంలో పోటీ.. ఎక్కువ ధర పలికిన వారికే లడ్డూ దక్కడం సాధారణం. అయితే అమీన్‌పూర్‌లోని గల్లీక గణేష్ నిర్వాహకులు అందుకు భిన్నంగా ఆలోచించారు. డబ్బు పోటీకి తావులేకుండా లక్కీ డ్రా ద్వారా లడ్డూను అందించే వినూత్న కార్యక్రమాన్ని నిర్వహించి ఉత్సవానికి కొత్త శోభ తీసుకొచ్చారు. నిమజ్జనం సందర్భంగా నిర్వహించిన ఈ లక్కీ డ్రాలో కంచనపల్లి నాగరాజు రెండో కుమార్తె పేరు రావడంతో ఆ కుటుంబంలో ఆనందం వెల్లివిరిసింది. ఈ సందర్భంగా నాగరాజు మాట్లాడుతూ.. లడ్డూ కోసం వేలంలో భారీ మొత్తంలో డబ్బు వెచ్చించడం కంటే అందరికీ అవకాశం కల్పించేలా లక్కీ డ్రా నిర్వహించడం ఎంతో అభినందనీయమన్నారు. ఇలాంటి కార్యక్రమాలు ప్రజల్లో ఐక్యత, ఆనందాన్ని పెంచడంతో పాటు గణేష్ ఉత్సవాల్లో ప్రతి ఒక్కరినీ భాగస్వాములను చేస్తాయని పేర్కొన్నారు. గల్లీ క గణేష్ నిర్వాహకులు డి. యాదగిరి, ఎం. భాస్కర్, తలారి ప్రవీణ్, జి. శివ, తలారి సందీప్, కే. గోపి, మన్నె అరవింద్, దానుల్లా అజయ్ తదితరులు కలిసి ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. సాధారణంగా లడ్డూ కోసం ఎవరు ఎక్కువ మొత్తం చెల్లిస్తారనే పోటీకి బదులుగా.. ప్రతి ఒక్కరికీ అవకాశం కల్పించేలా లక్కీ డ్రా నిర్వహించడం మంచి ఆలోచనగా స్థానికులు ప్రశంసించారు. ఉత్సవం అంటే ఆనందాన్ని పంచుకోవడం.. ఆ ఆనందంలో ప్రతి ఒక్కరినీ భాగస్వాములను చేయడమే అసలైన పండుగ స్ఫూర్తి అన్నట్టుగా గల్లీ క గణేష్ నిర్వాహకులు చేపట్టిన ఈ వినూత్న కార్యక్రమం నిలిచిందని పలువురు అభినందించారు.

Printed, Published and Owned by RAYINIPATLA KUMARASWAMY, Printed at RAMANI WEB OFFSET PRINTERS, Auto Nagar, Bommakal, Karimnagar, Editor : RAYINIPATLA KUMARASWAMY, MANAPRAJAVAANI BROAD CASTING AND PUBLICATIONS, Ankireddypally, Thanggellapally, Rajanna Sircilla, TELANGANA-505405. RNI NO:TGTEL/25/A5443 Contact No : 9440032006. MAIL ID : Kumaraswamyrayinipatla@gmail.com